క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేపట్టిన అనంతరం స్తోత్రపారాయణలు జరిపించారు. పంచామృతాలు, వివి ధ పండ్ల రసాలతో అభిషేకం పూర్తి చేశారు.

వీరభద్రుడు, శనగల బసవన్నకు పూజలు



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీ స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధి గాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్.లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.ప్రదోషకాల సమయంలో పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేపట్టారు. ఆరంభ పూజలలో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలు జరిపించారు. నందీశ్వరుడికి నానపెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యం సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

మహాకుంభాభిషేకానికి ఆహ్వానం



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవానికి మంగళవారం విజయవాడలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను ఈఓ ఎస్.లవన్న ఆహ్వానించారు. స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, వేదపండితులు గంటి రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

జయప్రదం చేయండి

నందికొట్కూరు: ఈ నెల 31న జరిగే సిద్ధేశ్వరం జల జాగరణ దీక్షను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బీసీ సంక్షేమ భవన కార్యాలయంలో జల జాగరణ దీక్ష పోస్టర్లను విడుదల చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

పగిడ్యాల: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున మంగళవారం తెలిపారు. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన రవి గౌడ్ కొంత కాలంగా అక్రమ మద్యం విక్రయిస్తున్నాడు. ఉదయం నందికొట్కూరు ప్రభుత్వ వైన్ షాపు నుంచి బిల్లులు లేకుండా 180 ఎంఎల్ 92 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా నెహ్రూనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ అనురాధ

మహానంది: పదో తరగతిలో ఇటీవల ఉత్తీర్ణత శాతం తగ్గిందని, ఆ శాతాన్ని మెరుగుపరుచుకోవాలని డీఈఓ అనురాధ సూచించారు. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా విధానం, ఉపాధ్యాయుల హాజరు, ఆహార పదార్థాల పంపిణీ తదితర వాటిని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఫెయిల్ కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

'జగనన్నకు చెబుదాం'కు స్పందన

మిడుతూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ నాగస్వామిరెడ్డి మూడు రోజుల క్రితం జగనన్నకు చెబుదాం (1902)కాల్ చేసి చెరుకుచెర్ల గ్రామం నుంచి తిమ్మాపురం వెళ్లే బీటీ రహదారి గుంతలమయమైందని ఫిర్యాదు చేశారు. పీఆర్ డీఈ ఆదేశాల మేరకు పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మంగళవారం సర్పంచ్‌తో కలిసి రహదారిని పరిశీలించారు. త్వరలో టెండర్లకు పిలిపించి నూతన రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భానుడి ఉగ్రరూపం

- పెరుగుతున్న ఎండలు
- మూడు రోజులుగా 41 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రత
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
- బయటకు రావడానికి జంకుతున్న జనం
- ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా నందికొట్కూరు ప్రధాన రహదారి

నందికొట్కూరు: భానుడు ఉగ్రరూపంతో నియోజకవర్గం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఉదయం 9, 10 గంటల నుంచే ఎండలు మండిపోతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా దర్శమిచ్చాయి. మూడు రోజుల నుంచి వరుసగా 41–43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కాగా ఉదయం పది గంటలు దాటిన తరువాత అత్యవసరమైతేనే బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ వచ్చినా తలపై టోపీ, గొడుగు, లేదా రుమాలు తప్పని సరిగా ధరించాలని, వద్ద నీళ్ల బాటిల్ ఉంచుకోవాలని, ప్రతి 20 నిమిషాలకు ఒకసారి నీళ్లు తాగలని పేర్కొంటున్నారు. ఇళ్లల్లో కూడా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచితే వేడి బయటకు వెళ్లిపోతుందని, ఎక్కువగా నీటిని తీసుకోవాలని, మాంసాహారం, నూనె పదార్థాలను తక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. తాజా పండ్లు, కర్బూజ, కలింగర, తాటి ముంజలు తదితర పండ్లు తీసుకుంటే ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు.



నియోజకవర్గంలో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు..

జూపాడుబంగ్లా	41 డిగ్రీలు
కొత్తపల్లి	41.8
మిడుతూరు	42.1
నందికొట్కూరు	41.3
పగిడ్యాల	41
పాములపాడు	42.4

ఎండలు మండుతున్నాయి



ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 నుంచి 10 గంటలకే బయటకు రాలేనంతగా ఉంటోంది.. పనికి వెళ్లాలంటే భయంగా ఉంది. కరువు పనికి వెళ్లాలంటే భయంగా ఉంటుంది.

– రవికుమార్, వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఎండలో బయటకు వెళ్లడం తగ్గించుకోవాలి. అత్యవసరమైతే గొడుగు లేదా టోపీ ధరించి, నీళ్ల సీసాతో వెళ్లాలి. కుండలో నీటిని తాగితే మేలు. తేలికైన ఆహారం తీసుకోవాలి. నీరు అధికంగా ఉండే పండ్లు తీసుకుంటే మంచిది. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ ఏఎస్ రాయుడు, నందికొట్కూరు

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో 2023–2024 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ పీఓ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో నంద్యాల జిల్లా వారికి గ్రూప్‌నకు 40 సీట్ల చొప్పున ప్రకాశం, వైఎస్సార్ కడప, గుంటూరు జిల్లాల వారికి గ్రూప్‌నకు 5 సీట్లు చొప్పున, ఎఅండ్‌టిలో 20 సీట్లు నంద్యాల జిల్లా ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే కేటాయించినట్లు పేర్కొన్నారు. చెంచు,గిరిజన బాలురకు సీట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఉంటుందని, బీసీ, ఓసీ, ఎస్సీ, ఏఈక్యూలకు ఒక్కొక్క సీట్ చొప్పున కేటాయించామన్నారు. విద్యార్థులు పదిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను www.a pt-wf ur uk u a-m.a p.g-o-v.i n కు ఈ నెల 31వ తేదీలోగా సమర్పించాలని కోరారు. దరఖాస్తుతో పాటు మీ సేవా కేంద్రం నుంచి తీసుకున్న పదో తరగతి మార్కుల జాబితా జత చేసి, ప్రిన్సిపాల్ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(బాలురు) శ్రీశైలం, నంద్యాల జిల్లాకు అనే అడ్రస్‌కు పంపాలని సూచించారు. జూన్ 8న కౌన్సెలింగ్ ఉంటుందని, ఆ సమయంలో ఇన్‌కం సర్టిఫికెట్, కులం, ఫిజికల్ ఫిట్‌నెస్, టీసీ, స్టడీఅండ్ కండక్ట్, 10 వ తరగతి మార్కుల జాబిత, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, తల్లి బ్యాంక్ పాస్‌బుక్, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో విద్యార్థి తల్లి, తండ్రి, సంరక్షుల్లో ఒకరు హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ 9490957268 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నవరత్నాలతో పేద కుటుంబాల్లో వెలుగు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. గాజులపల్లె గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల క్యాలెండర్లను చూపిస్తూ అమ్మా...ఈ పథకాలు ఎవరిచ్చారు అని ప్రశ్నించగా.. ఇంకెవరూ మా జగన్ బాబూ అంటూ ప్రజలు సంతోషంగా చెప్పారు. మళ్లీ మాకు ముఖ్యమంత్రిగా జగనన్నే కావాలంటూ ముక్త కంఠంతో చెప్పారు. అవ్వా పింఛను వస్తుందా, అన్నా పిల్లలు బాగా చదువుతున్నారా అంటూ ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వలంటీర్లు విధుల్లో అలసత్వం వహించకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు(కిట్టు), నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, ఏపీ మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి ఎల్లాలు బాబు, పార్టీ మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహుడు, గజ్జా పెద్ద ఫక్కీరయ్య, వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, మురాత్‌ఖాన్, బొజ్జయ్య పాల్గొన్నారు.

కృష్ణా నదిలో అనుమతులు లేని బోట్లు తిప్పరాదు



మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీశైలంప్రాజెక్ట్: కృష్ణా నదిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బోట్లను తిప్పరాదని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మంగళవారం శ్రీశైలం సర్కిల్ కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, టుటౌన్ పోలీస్ అవుట్‌పోస్టును తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులు, ప్రాపర్టీని తనిఖీ చేశారు. నేరాలపై సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐలు లక్ష్మణరావు, గంగయ్య యాదవ్‌లతో సమీక్షించారు. గతంలో మావోయిస్టులు పేల్చివేసిన పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ పరిశీలించారు. అనంతరం లింగాలగట్టు మత్స్యకారులతో సమావేశమై వారికి సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.

మత్స్యకారులు లైఫ్ జాకెట్లు ధరించాలి

వెలుగోడు: చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్స్ ధరించాలని ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. ఎస్ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మంగళవారం మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ..రిజర్వాయర్‌లో వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్స్ ధరించాలని, బోటులో గాలి ట్యూబ్స్ ఉంచుకోవాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. లైసెన్స్ లేని వారు వేటకు వెళ్లొద్దని ఆదేశించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓ బాలాజీనాయక్, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఈ రాఘవేంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ చౌడయ్య పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో విశ్రాంత వీఆర్ఓ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ధనుశ్యాల లింగమయ్యకు బలులు అర్పించేందుకు వెళ్లిన భక్తులపై తేనెటీగలు దాడి చేయడంతో విశ్రాంత వీఆర్ఓ మృతి చెందగా, 60 మంది తీవ్ర అస్వస్థకు గురయ్యారు. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన ఓ కుటుంబం దాదాపు 30 వాహనాల్లో 180 మంది బంధువులతో కలిసి మొక్కు తీర్చుకునేందుకు కొత్తపల్లి మండలం పాత మాడుగుల గ్రామ సమీపంలో నల్లమల అటవీ సమీపంలోని ధనుశ్యాల లింగమయ్య ఆలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో చెట్లపై ఉన్న తేనేటీగలు భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో వెంకటశివారెడ్డి(65) తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. సుమారు 60 మంది తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు, బంధువులు బాధితులను ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యాధికారిణి సౌజన్య, ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు బాధితులకు చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి

- మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్



విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శామూన్

పాములపాడు: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల రూము, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు.

ఆర్బీకే కేంద్రంలో..

రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కియోస్క్ పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో రైతులు ఎంత మంది ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎరువుల పంపిణీ, ఏ పైరు ఎక్కువగా సాగు చేస్తారు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయా, సరిపడ వస్తున్నాయా అని ప్రశ్నించారు. గత సంవత్సరం నుంచి సోయాబీన్ సాగు పెరిగిందని, మొక్కజొన్న ప్రధాన పంట అని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. రైతులకు నాణ్యమైన మందులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది గ్రామాల్లో ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు. ఏయే సేవలందిస్తున్నారని ప్రశ్నించారు. ప్రసూతి గది, వార్డు, అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు నమోదయ్యాయి, ఈడీడీ జాబితాను పరిశీలించారు. అల్ట్రా సౌండ్ మిషన్ ఉందని.. ఆపరేటర్ లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని, పాములపాడు, బానుముక్కల గ్రామాల్లోని సబ్‌సెంటర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, పీహెచ్‌సీలో మీటింగ్ హాల్ కావాలని డాక్టర్ నాగలక్ష్మి కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

హైస్కూల్‌లో..

ఏఎస్ఆర్‌జెడ్పీహెచ్ స్కూలులో పాఠ్యపుస్తకాలు, జగనన్న కిట్లలో భాగమైన యూనిఫాంను పరిశీలించారు. అలాగే పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ఇస్తున్న రెమిడీయల్ తరగతిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం బానుముక్కల ఎంపీయూపీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. ఆర్డీఓ దాసు, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్ఎం వెంకటసుబ్బమ్మ, ఏఈలు రాఘవేంద్రప్రసాద్, శివరామకృష్ణారెడ్డి, జుబేర్, ఏపీఎం అనురాధ ఉన్నారు.

పన్నులు చెల్లించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్టులోని నీటిపారుదల శాఖకు చెందిన ప్రభుత్వ గృహాల్లో నివసిస్తున్న వారు ఇంటి అద్దె, నీటి పన్నులు చెల్లించాలని క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాసులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.అద్దెలు కట్టని వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అద్దె చెల్లించని ఉద్యోగులు సుమారు 280 మంది వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

'వైఎస్సార్ కల్యాణమస్తు' వరం

మిడుతూరు: వైఎస్సార్ కల్యాణమస్తు పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి లక్ష్మీదేవి కూతురు పథకానికి అర్హత పొందింది. తల్లి లక్ష్మీదేవి బ్యాంకు ఖాతాలో రూ. 50 వేలు జమైందని, ఇందుకు సంబంధించిన జమ పత్రాన్ని అందజేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాగటూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

బుడ్డా.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల: బుద్ధి లేని బుడ్డా రాజశేఖర్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. లోకేష్, చంద్రబాబు మెప్పు కోసం అసభ్య పదజాలంతో మాట్లాడి నా మనసును నొప్పించారన్నారు. గతంలో స్వామిమాల వేసుకొని బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దుర్భాషలాడారన్నారు. చీటింగ్ చక్రపాణిరెడ్డి అంటూ తనకు పేరు పెట్టారని, అందుకే తాను లోఫర్ లోకేష్ అన్నానని చెప్పారు. టీడీపీ హయాంలో నీరు–చెట్టు పనుల్లో మూడు తరాలకు సరిపడేలా దోచుకున్నావని ఆరోపించారు. ×వర్ధన్ బ్యాంక్‌పై సీబీఐ విచారణ చేయించాలని చెబుతున్నావు కదా.. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా నువ్వే నాపైన నా సంతకాలతో ఫిర్యాదు చెయ్ అంటూ సవాల్ విసిరారు. ఆరోపణ రుజువైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా, అలా కాకపోతే నువ్వు తప్పుకుంటావా అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉండి టీడీపీకి అమ్ముడుపోయిన నువ్వు తన మాట్లాడే అర్హత లేదన్నారు. పూజారిని కొట్టి, ఆర్యవైశ్యుడిని బెదిరించిన నువ్వు.. నీతులు చెబితే ప్రజలు నమ్మరన్నారు. జగనన్న పుణ్యమా అని ఒక్కసారి గెలిచావ్, ఆ తరువాత మూడు సార్లు ఓడిపోయిన నువ్వు.. నా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, బండిఆత్మకూరు ఎంపీపీ సంజీవరెడ్డి, వెలుగోడు మండల కన్వీనర్ అంబాల ప్రభాకర్‌రెడ్డి, బండిఆత్మకూరు మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా వివిధ కార్యాలయాల నిర్మాణాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామాలకు రహదారులు, అర్హులకు పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. మండలంలోని గువ్వలకుంట్ల, జీ.వీరాపురం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పథకాల అమలు విధానం, చేకూరిన లబ్ధి, అభివృద్ధి పనులను వివరించారు. ఆయా గ్రామాల్లో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఏఓ మహేష్, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ రాజునాయక్, నాయక్, సర్పంచులు బోరెడ్డి సరస్వతి, చంద్రశేఖర్ యాదవ్, కలబండి మారెన్న, నక్క విజయ్‌కుమార్, నాయకులు జీఎండీ రఫీ, సహదేవుడు, శ్రీనాథరెడ్డి, మల్లికార్జున యాదవ్, మీసాల వెంకటరెడ్డి, సాయిరాం, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు యాదవ్, అయ్యపురెడ్డి, జె.రాము, జక్కరయ్య, కుమార్, ఓబులేసు, ఎల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరింది ఐదు కుటుంబాలే

మహానంది: టీడీపీ నేత నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం పార్నపల్లెలో పలువురు టీడీపీలో చేరారు. అయితే 120 కుటుంబాలకు పైగా చేరాయని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని, కేవలం ఐదు కుటుంబాలు మాత్రమే చేరాయని వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

హాజరు సక్రమంగా వేయాలి

పగిడ్యాల: ఉపాధి హామీ పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది బోగస్ హాజరుకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఎం,ఎస్. ఘణపురంలో జరిగే పనులను పరిశీలించి సూచనలు చేశారు.

పాఠశాల స్థల వివాదం పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల స్థల సమస్యను అన్నిశాఖల మండలస్థాయి అధికారులు సమన్వయంతో మంగళవారం పరిష్కరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఈఓ భేగ్, నాడు–నేడు నోడల్ ఆఫీసర్ లలిత, తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, పీఆర్ ఏఈ బషీర్, ఎంఈఓ మోహన్, సర్పంచ్ ప్రకాశం గ్రామానికి చేరుకొని పాఠశాల స్థల సమస్యను పరిష్కరించారు. జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించి నాడు–నేడు పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టా రు. ఏడాది క్రితం పాఠశాలకు రూ.25 లక్షలతో అదనపు తరగతి గది, టాయ్‌లెట్, ప్రహరీ, తాగు నీటి సౌకర్యం వంటివి మంజూరయ్యాయి. స్థల సమస్య వల్ల పనులు ప్రారంభం కాలేదు. విషయం తెలుసుకున్న కలెక్టర్.. వెంటనే స్థల సమస్యను పరిష్కరించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. దీంతో మండలస్థాయి అధికారులు సమస్యను పరిష్కరించి పనుల ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు.